# అసలు రంగు

అసలు రంగులు కన్నా వేసుకున్న రంగులు మహా అందంగా వుంటాయట. నకిలీ రంగుని చూసి అదే నిజమైన రంగని భ్రమలో పడిపోయి, ఆ రంగులు , ఆ అందాలు మనకి లేనందుకు, రానందుకు లోపల్లోపల వర్రీ అయిపోతాం. తీరా నాలుగు రోజుల తర్వాత నకిలీ రంగు కాస్త పోయి, అసలు రంగు బయట పడిపోతే ఇదా సంగతంటూ విస్తుపోతాం. అసహ్యించుకుంటాం.

పండగ సందర్భంగా యాభై శాతం తగ్గింపు రేట్లని పబ్లిసిటీని నమ్మి శ్రీమతిని తీసుకెళ్ళి ప్రేమగా శారీ కొనిస్తారు. కలరు గ్యారంటీ, పోతే వాపసివ్వమంటాడు. అంతే – ఇంటికొచ్చి ఒక్కసారి నీళ్ళల్లోగాని ముంచారంటే, పై రంగు అయిపూ అజా లేకుండా అదృశ్యమయ్యి అసలు రంగు బయట పడుతుంది. అదే పద్ధతిలో పెళ్ళి చూపుల కంటూవెళ్ళినప్పుడు , పిల్ల సిగ్గుపడుతూ తలదించుకూర్చుంటుంది. పిల్ల దీపంలాగా వుందని ముచ్చట పడిపోతాం. పైగా ఆ వైపు పెద్ద వాళ్ళు బాగా అనుభవం కలిగిన సేల్సుమెన్నులాగా, మా పిల్ల మితభాషి, పైగా పెద్దవాళ్ళంటే, చచ్చే గౌరవం అంటూ ఏకరువువ పెడితే అదే అసలు సిసలయిన రంగని నమ్మేసి, పిచ్చి వెధవాయిలాగా పచ్చ జెండా వూపేస్తాం. పెళ్ళయి పోతుంది. అంతే – ఒక్క వుతుక్కే శారీ రంగు పోయినట్లు, అప్పగింతలు అవగానే అసలు రంగు బయటికొస్తుంది. మితభాషి కాస్తా అమిత భాషిగా సాక్షాత్కారిస్తుంది. వేపుకు తినటానికి తనకి వయసుతో సంబంధం లేదని డిక్లేర్ చేస్తుంది. అలాగే మగాళ్ళుకూడా ..... ప్రేమించే రోజుల్లో నువ్వే నా ప్రాణం అంటారు. కాదంటే కళ్ళ ముందరే చచ్చిపోతానంటారు. అమ్మడు అదంతా నిజమేనని నమ్మి ఇంట్లో చిచ్చుపెడుతుంది. విరహాలు విషాద పాటలు అయ్యేక పెళ్ళవుతుంది. ఏడాది తిరక్కుండానే ఎడమొహం పెడ మొహం. లబో దిబోలు తన్నులాటలూ. గుద్దులాటలున్నూ, పక్క వాళ్ళకి కావాల్సినంత కాలక్షేపం.

ఒక్కొక్కసారి నకిలీ రంగులు అసలు రంగుని కూడా మార్చేసి కొత్త రంగుని ప్రసాదిస్తాయి. తెల్ల జుట్టు మాష్టారు కుర్రాడినని నమ్మించాలని నల్ల రంగు పూస్తాడు.

రంగేసాడని మనకీ తెలుసు. మనకి తెలిసిపోయిందని ఆయనకీ తెలుసు. కాని ఆయన చెప్పడు మనం అడగం. కొంతకాలం గడుస్తుంది. ఆ తర్వాత వారి తల రసాయనిక మార్పుకి గురయ్యి అటు నకిలీ నలుపు, ఇటు అసలు తెలుపు రంగుని పోగొట్టుకుని అనే రంగుల్లో వికసించి, చిత్రకారుడి చేతి గుడ్డలాగా తయారయ్యి కూర్చునుంటుంది. ఆ శిరస్సుని చూసి జాలిపడి రెండు కన్నీటి బొట్లని రాల్చటం మినహా మనవేం చెయ్యలేం. అంచేత ఒక్కోసారి జబ్బుకన్నా వైద్యం ప్రాణాంతకం అవుతుంది. ఆలోచించి ప్రోసీడవటం మంచిది.

మనం పెద్ద మనుషులని గౌరవించే వాళ్ళలోగూడా అవకాశాలు రాక అలా వుండిపోయిన వాళ్ళయివుండొచ్చు. చెప్పలేం .....ఎలుక కంట పడనంత సేపు పిల్లి అందరి ఇళ్ళల్లో పిల్లుల్లాంటిది కాదు బుద్ధి మంతురాలనుకుంటాం. తీరా ఎలుక దర్శనం ఇచ్చేక దాన్ని మనం పట్టుకోలేం. ప్రతి పక్షంలో వున్నప్పుడు హరిశ్చంద్రం శతకం పారాయణ చేసే వాడు పదవి రాగానే రంగుని మార్చి రెచ్చిపోతాడు. అసలు రంగు చూసి ఆశ్చర్యపోతాం. జీవితమే ఒక పెద్ద నాటకం అని మొట్ట మొదటగా చెప్పిన మాహనీయుడికి నిజంగా చేతులెత్తి నమస్కరించాలి,

రంగస్థలం పైన నటించే వాళ్ళు మొహానికి రంగులు పూసుకుని నటిస్తారు. మనవూ అంతే ! రంగులు పూసుకుని అందర్నీ నమ్మిస్తాం. అవకాశం రాగానే అసలు రంగుని బయటపెడతాం. నరుడికి నాలుగు దశలంటారు. అంటే నాలుగు రంగులన్నమాట. అంచేత నాలుగు రంగులు వరకు మనకి లైసెన్సుంది. కాకపోతే రెచ్చిపోయి రోజుకో రంగు మారిస్తేనే గొడవలయిపోతాయి. అసలు రంగుల్ని అవలీలగా గుర్తించే వాళ్ళుంటారు. జాగ్రత్తగా వుండటం మంచిది. ఇద్దరు కుర్రాళ్ళు ఒక కుక్కని పట్టుక్కూర్చున్నారట. ఆ వైపుగా వెడుతున్న ఒక వృద్ధుడు ఏవిటి సంగతి అడిగితే, పెద్ద అబద్ధం చెప్పిన వాళ్ళకి దీన్ని బహుమతిగా ఇచ్చేస్తాం అన్నారట. దానికా పెద్దమనిషి గర్వంగా నవ్వుతూ నా కసలు అబద్ధం ఆడటమే తెలీదన్నాట్ట. దాంతో ఆ కుర్రాళ్ళు ఆ కుక్కని వారికిచ్చేసి చక్కా పోయేరట. అంచేత మనం కళ్ళు మూసుకున్నంత మాత్రాన ప్రపంచం గుడ్డిదనుకోవటం పరమ డేంజరు. పైగా పాపంగూడాను. కళ్ళు పోతాయ్ తస్మాత్ జాగ్రత్త !

------- అయ్యిపోయింది -------